ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 07-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10వ తేదీ నుండి ఫ్రాన్స్, అమెరికా దేశాల్లో పర్యటించనున్నారు.
- గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలను అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.
- పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా నిలుస్తుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.
- దేశంలో వరుసగా రెండవ వారం.. విదేశీ మారక నిల్వలలో పెరుగుదల నమోదయిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఫ్రాన్స్ లోను.. అనంతరం అమెరికాలోను పర్యటిస్తారని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ప్రధానమంత్రి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తో కలిసి కృత్రిమ మేధ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరవుతారని, అలాగే.. కేడరాచి థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను పరిశీలించనున్నారని వివరించారు. కాగా.. ప్రధానమంత్రి అమెరికా పర్యటనలో భాగంగా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశమయ్యి, పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్టు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనవరి 31తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 1.05 బిలియన్ డాలర్లు పెరిగి 630.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. నిల్వలు పెరగడం ఇది వరుసగా రెండోవారం. అంతకుముందు వారంలో, దేశ ఫోరెక్స్ నిల్వలు 5.57 బిలియన్ డాలర్లు పెరిగి 629.55 బిలియన్ డాలర్ల వద్ద స్థిరపడ్డాయి. జనవరి 31తో ముగిసిన వారానికి, రిజర్వుల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 207 మిలియన్ డాలర్లు తగ్గి 537.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అదే సమయంలో, బంగారం నిల్వలు 1.2 బిలియన్ డాలర్లు పెరిగి, 70.89 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జెపి నడ్డా అన్నారు. లోక్‌సభలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు క్రియాశీలక సహకారంతో దేశ పౌరులకు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల వారికి ఉత్తమమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చూస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు, ఆ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ మాట్లాడుతూ.. మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సమగ్ర, బహుముఖ చర్యలతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. జాతీయ ఆరోగ్య మిషన్‌ను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల దేశంలోని ప్రతి పౌరునికి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు చేరువయ్యాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో త్రివేణి సంగమం వద్ద ఇప్పటివరకు 40 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని నిర్వాహకులు తెలిపారు. మకర సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత్ పంచమి మూడు పర్వదినాల నాటి అమృత స్నానాల తరువాత కూడా భక్తుల రద్దీ అలాగే కొనసాగుతోందని పేర్కొన్నారు. కుంభమేళా పూర్తి కావడానికి ఇంకా 19 రోజులు మిగిలి ఉన్నందున, స్నానాలు చేసే వారి సంఖ్య 50 కోట్లు దాటుతుందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. కాగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరి 10న త్రివేణి సంగమం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 53 టెలి మనస్ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 18 లక్షలకు పైగా ఫోన్ కాల్స్‌ను నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ ఈరోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. టెలి - మనస్ సేవలు 20 భాషల్లో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన దశాబ్ద కాలంలో భారత్ ఇంధన రంగం స్ఫూర్తిదాయకమైన ఫలితాలను నమోదు చేసిందని పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 100 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని అధిగమించడం ద్వారా భారత్ ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిందని, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులలో ప్రపంచ అగ్రగామిగా దేశాన్ని నిలిపిందని చెప్పారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజ రహిత ఇంధన లక్ష్యాన్ని సాధించడానికి సంబంధించి ఇది ఒక ముఖ్యమైన దశను సూచిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) పాలసీ రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ముంబైలో మూడు రోజుల పాటు జరిగిన ఎంపీసీ సమావేశం అనంతరం ఈ విషయాన్ని ప్రకటిస్తూ.. రెపో రేటు 5 సంవత్సరాల తర్వాత, 25 బేసిస్ పాయింట్లు తగ్గినట్టు పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, 2025-26లో క్రమంగా లక్ష్యానికి అనుగుణంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరానికి వాస్తవ జిడిపి వృద్ధి 6.4 శాతంగా అంచనా వేయబడిందని, రాబోయే సంవత్సరంలో ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇ-నామ్ పోర్టల్‌లో 4300 వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు నమోదు చేసుకున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పలు అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేలకు పైగా ఎఫ్‌పిఓలు ఏర్పడ్డాయని, 1400 మార్కెట్లు ఈ-నామ్ పోర్టల్‌లో చేరాయని వివరించారు. ఈ-నామ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫార్మ్ గేట్ మాడ్యూల్ సహాయంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల ఫోటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఇంటి వద్ద నుండే ఈ-నామ్ ప్రయోజనాన్ని పొందవచ్చన్నారు. 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అంతర్ రాష్ట్ర వ్యాపారం కోసం ఇ-నామ్ పోర్టల్‌లో చేరాయని, అంతర్ రాష్ట్ర వాణిజ్యం కింద రైతులకు దాదాపు 6 వేల కోట్ల రూపాయల చెల్లింపులు నేరుగా జరిగాయని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వినియోగదారుల సమస్యల పరిష్కారంలో వేగాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అధునాతన కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పనిచేసే కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (NCH) సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆ శాఖ వెల్లడించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఆధునీకరించడం ద్వారా 2015 సంవత్సరంలో 12 వేల 500 ఫిర్యాదులను స్వీకరించడం నుండి ప్రస్తుతం 1 లక్షా 55 వేలకు పైగా ఫిర్యాదులను స్వీకరించే స్థాయికి చేరినట్టు వివరించింది. తాజాగా ప్రవేశపెట్టిన ఏఐ టెక్నాలజీ, ఆధారిత NCH.. సెక్టార్ వారీగా ఫిర్యాదుల విశ్లేషణను అందిస్తుందని,

ఉత్పత్తులు లేదా సేవలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్: 1915 లేదా *consumerhelpline.gov.in* వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చని ఆ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా జనవరి నెలలో ఆధార్ ప్రామాణికంగా 284 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయని, ఇది డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణను వెల్లడిస్తుందని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో 214.8 కోట్ల లావాదేవీలు జరిగాయని, జనవరి నెల లావాదేవీలలో 32 శాతానికి పైగా వృద్ధి నమోదయ్యిందని పేర్కొంది. ఈ సంవత్సరం జనవరిలో 43 కోట్లకు పైగా eKYC లావాదేవీలు జరిగాయని, జనవరి నెలాఖరు నాటికి, ఆధార్ eKYC లావాదేవీల సంఖ్య 2 వేల 268 కోట్లు దాటిందని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారుల తుది జాబితాలో 487 మంది భారతీయులు ఉన్నట్టు విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఈ విషయం అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసినట్లు పేర్కొంది. వలసదారులకు సంకెళ్లు వేసి తరలిస్తున్నారని వస్తోన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఈ అంశానికి సంబంధించి అమెరికాకు తమ ఆందోళన తెలియజేశామని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతామని, అక్రమంగా అమెరికా వెళ్లినట్లు గుర్తించిన భారతీయులను సురక్షితంగా తీసుకువస్తామని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా గత ఏడాది డిసెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 100 రోజులలో ఒక లక్షా 59 వేల మందికి పైగా క్షయ రోగులను కొత్తగా గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమం కింద ఈ నెల 1వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 4 లక్షల 94 వేల ని-క్షయ్ సేవలు నిర్వహించామని, 5 లక్షల 63 వేల మంది బలహీనంగా ఉన్న వ్యక్తులకు వైద్య పరీక్షలు చేశామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =